www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 15 జులై 2025 | 5 | ఏలూరు

సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు ఇవే

పశ్చిమలో 51, ఏలూరులో 23 కమిటీలు ఏర్పాటు

ఏలూరు ప్రతినిధి : సహకార సంఘాల త్రిసభ్య కమిటీల రెండో జాబితాను ప్రభుత్వం సోమవారం రాత్రి విడుదల చేసింది. ఇప్పటికే తొలి జాబితా విడుదల కావడం, సంబంధిత కమిటీలు ప్రమాణ స్వీకారం పూర్తయిన సంగతి తెలిసిందే. రెండో జాబితాలో పశ్చిమగోదావరి జిల్లాలో 51 సంఘాలకు, ఏలూరు జిల్లాలో 23 సంఘాలకు కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. ఏలూరు జిల్లాలో మొత్తం 159 సహకార సంఘాలకుగాను 34 సంఘాలను నియమించగా, రెండో జాబితాలో 23 కమిటీలను ప్రకటించింది. దీంతో మొత్తం 57 సంఘాలకు కమిటీలు ఏర్పడ్డాయి. పశ్చిమలో మొత్తం 122 సహకార సంఘాలకు తొలి జాబితాలో ఒకటి, రెండో జాబితాలో 51 సంఘాలకు కమిటీలు ప్రకటించారు. దీంతో పశ్చిమగోదావరిలో మొత్తం 52 సంఘాలకు కమిటీల నియామకం జరిగినట్లయ్యింది. మిగిలిన సంఘాలకు త్వరలోనే త్రిసభ్య కమిటీలను నియమించే అవకాశం ఉంది.

ఏజెన్సీలో

తహశీల్దార్ నిరంకుశత్వం..!

- పెసా చట్టానికి బుట్టాయగూడెం తహశీల్దార్ తూట్లు
- పంచాయతీ సర్పంచి, సభ్యులు లేకుండా రెడ్డిగణపవరంలో గ్రామసభ
- నిర్వాసితులకు భూసేకరణ పేరుతో అడ్డగోలుగా ముందుకు
- ముగ్గురు గిరిజనేతరులను పిలిచి తీర్మానం చేసేందుకు కుట్ర
- గ్రామసభను అడ్డుకుని నిరసన తెలిపిన గిరిజనులు
- జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో, సమర్థిస్తారో?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, బుట్టాయగూడెం

ఏజెన్సీలో పెసా (పంచాయతీ విస్తరణ షెడ్యూల్ ఏరియా) చట్టాన్ని తుంగలో తొక్కుతూ బుట్టాయగూడెం తహశీల్దార్, అక్కడి రెవెన్యూ సిబ్బంది అత్యంత నిరంకుశంగా ముందుకు సాగుతున్న తీరు చూస్తే ప్రజాసామ్య దేశంలో ఉన్నామా.. నియంతృత్వ పాలనలో ఉన్నామా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే అందుకు విరుద్ధంగా అక్రమార్కులకు కొమ్ముకాస్తూ అమాయక గిరిజనులకు అన్యాయం చేస్తున్న పరిస్థితి యథేచ్ఛగా సాగుతోంది. ఏజెన్సీ మండలాల్లోని రెవెన్యూ అధికారులు అక్కడి గిరిజనుల కోసం కాకుండా కొంతమంది అక్రమార్కుల కోసం పని చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలవరం నిర్వాసితులకు భూసేకరణ పేరుతో పంచాయతీ సర్పంచి, సభ్యులకు, అక్కడి గిరిజనులకు చెప్పకుండా రెడ్డిగణపవరంలో సోమవారం తహశీల్దార్ గ్రామసభ నిర్వహించేందుకు సిద్ధమైన తీరు చూస్తే అధికారుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏజెన్సీలో ఏదైనా పని చేయాలంటే గ్రామసభ ఆమోదం తప్పనిసరి. ఏజెన్సీలో జరిగే గ్రామసభకు పంచాయతీ సర్పంచి అధ్యక్షులుగా, పెసా కమిటీ ద్వారా ఎన్నికైన ఉపాధ్యక్షులు, ఇతరులు సభ్యులుగా ఉంటారు. ఒకవేళ పెసా కమిటీ లేకపోతే గ్రామ సర్పంచి, సభ్యులు, గ్రామంలోని ప్రజలకు తెలియజేసి గ్రామసభ నిర్వహించాలి. ఏజెన్సీలో భూసేకరణ చేయాలన్నా, అభివృద్ధి పనులు చేపట్టాలన్నా గ్రామసభ తీర్మానం తప్పనిసరి. ఏజెన్సీ ప్రాంతానికి పెసా చట్టం ఒక రక్షణ కవచంలా పనిచేస్తోంది. బుట్టాయిగూడెం తహశీల్దార్ చలపతి మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో గిరిజనులంతా సోమవారం రెడ్డిగణపవరంలో ఆందోళనకు దిగారు.

సర్పంచి, పాలకవర్గం, గ్రామస్తులు లేకుండానే గిరిజనేతరులు ముగ్గురితో గ్రామసభ నిర్వహిస్తున్న తహశీల్దార్

అక్రమార్కులకు అండగా రెవెన్యూ అధికారులు

పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం 2017లో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పెద్దఎత్తున భూసేకరణ చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, తూర్పుగోదావరి జిల్లాలోని మండలాల నుంచి తరలించిన గిరిజనులకు భూమికి భూమి, కాలనీల కోసం ఆ భూములను ఉపయోగించారు. అప్పట్లో ఇంకా వెయ్యి ఎకరాలకుపైగా భూమి మిగిలింది. దీంతో ఈ భూమిని పోలవరం నిర్వాసితుల అవసరాల నిమిత్తం భవిష్యత్తులో వినియోగిస్తామని అప్పట్లో ఐటిడిఎ పిఒ చెప్పారు. అయితే అలా మిగిలిన వెయ్యి ఎకరాల భూమి ఏమైందో తెలియకుండాపోయింది. అడిగినా రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పడం లేదు. ఇప్పుడు మళ్లీ వేలాది ఎకరాలు భూములు సేకరించేందుకు రెవెన్యూ అధికారులు పూనుకున్నారు. గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య వివాదాలు నడుస్తున్న భూములను సేకరించి గిరిజనేతర భూస్వాములకు అడ్డగోలుగా సొమ్ము కట్టబెట్టాలని అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను అడ్డగోలుగా భూసేకరణ పేరుతో లాక్కుని అక్రమార్కులకు మేలు చేసేలా ముందుకు సాగుతున్నారు. దీనిలో భాగంగా పంచాయతీ సర్పంచి, ఉపసర్పంచి, సభ్యులకు సమాచారం ఇవ్వకుండా, తహశీల్దార్ తమకు అనుకూలంగా ఉండే గిరిజనేతరులను ముగ్గురిని కూర్చోబెట్టుకుని తీర్మానం చేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న గిరిజనులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులను పిలిపించుకుని తహశీల్దార్ మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. గ్రామసభ అని ఫ్లెక్సీ పెట్టిన తహశీల్దార్ గిరిజనులు నిలదీసే సరికి గ్రామసభ కాదంటూ బుకాయించారు. గ్రామసభ కాకపోతే ఆ బోర్డు ఎందుకు పెట్టినట్లో ఆయనే చెప్పాలి. నిబంధనలకు విరుద్ధంగా ముందుకు సాగుతున్న తహశీల్దార్, అక్కడి రెవెన్యూ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో.. లేక సమర్థిస్తారో వేచిచూడాలి.

రహస్యంగా గ్రామసభ సిగ్గుచేటు

కొర్సా జలపాలు, రెడ్డిగణపవరం మాజీ సర్పంచి

స్థానికంగా ఉన్న గిరిజనులకు, ప్రజలకు ఏ విధమైన సమాచారం లేకుండా ఇష్టారాజ్యంగా గ్రామసభ నిర్వహించడం ఎంతవరకు సమంజసం. గిరిజనులు అనేకసార్లు ఫిర్యాదులు చేసినా రికార్డు పరిశీలించాలని కోరినా పట్టించుకోని అధికారులు గిరిజనేతరుల కోసం ఈ విధంగా రహస్యంగా గ్రామసభ నిర్వహించడం సిగ్గుచేటు.

మాకు ఎటువంటి సమాచారం లేదు

బి.సత్యనారాయణరాజు, గ్రామ ఉపసర్పంచి

రెడ్డిగణపవరం గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్నారని పంచాయతీ పాలకవర్గానికి ఎటువంటి సమాచారం లేదు. ఇంతకుముందు ఎప్పుడూ ఈ పద్ధతిలో గ్రామసభలు నిర్వహించలేదు. పంచాయతీరాజ్ చట్ట ప్రకారం గ్రామ సభలు నిర్వహించడానికి ప్రజల అంగీకారం తప్పనిసరి. ముందుగా మైక్ ద్వారాగాని, దండోరా ద్వారాగాని గ్రామసభ సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా రహస్యంగా గ్రామసభ ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందో అధికారులే సమాధానం చెప్పాలి. ఈ గ్రామసభ నిర్వహణకు, పంచాయతీ పాలకవర్గానికి ఏ విధమైన సంబంధం లేదు. ఇది పూర్తిగా చట్ట ఉల్లంఘన కిందకే వస్తుంది.

గిరిజన చట్టాల అమలుపై అధికారులకు చిత్తశుద్ధి లేదు

గొడ్డ పవన్‌కల్యాణ్, రెడ్డి గణపవరం

గిరిజన చట్టాల పట్ల, గిరిజన సంక్షేమం పట్ల ఇక్కడ పనిచేస్తున్న అధికారులకు ఎటువంటి చిత్తశుద్ధీ లేదు. పేరుకు మాత్రమే గిరిజన చట్టాలు. అమలులోకి వచ్చేసరికి అవి అందని ద్రాక్షగా మిగులుతున్నాయి. ఈరోజు గ్రామసభ రహస్యంగా నిర్వహించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది. గతంలోనూ గిరిజనుల సాగులో ఉన్న భూములు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో కొనుగోలు చేసి నిర్వాసితులకు, స్థానిక గిరిజనులకు మధ్య తగాదాలు పెట్టారు. ఇదే వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. ఇది చాలా దుర్మార్గం.

పిజిఆర్ఎస్‌లో అర్జీ ఇచ్చినా విచారించలేదు

ఉయిక శ్రీరాములు, రెడ్డిగణపవరం

మా భూములకు రక్షణ కల్పించండి అని, తమ సాగులో ఉన్న భూములను కొనుగోలు చేయొద్దని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసి 15 రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టలేదు. ఈ రోజు అవే భూములను ఆర్‌అండ్‌ఆర్‌లో అమ్మకానికి పెట్టేందుకు రహస్యంగా మా గ్రామంలో ఎవరికీ తెలియకుండా గ్రామసభ నిర్వహించడానికి స్వయంగా తహశీల్దారే రావడం అన్యాయం. చట్టాల్ని కాపాడాల్సిన అధికారులే చట్టాల్ని ఉల్లంఘిస్తే ఇక మేం ఎవరికి చెప్పుకోవాలి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి, గత 30 ఏళ్లుగా సాగులో ఉన్న మమ్మల్ని హక్కుదారులుగా గుర్తించాలి.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ప్రజా ఉద్యమాలు : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి హెచ్చరించారు. సోమవారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ట్రూఅప్ ఛార్జీలు పేరుతో ప్రజలపై భారాలు వేయొద్దని నినాదాలు చేశారు. నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ధ్వజమెత్తారు. నాడు ప్రతిపక్ష పార్టీ నేతగా నారా లోకేష్ అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ, అవసరమైతే పగులగొట్టి నిరసన తెలపాలి అంటూ చెప్పిన మాటలను గుర్తు చేశారు. అవసరం లేకపోయినా రూ.38 వేలు విలువైన స్మార్ట్ మీటర్ బిగించి కరెంట్ బిల్లుతోపాటు స్మార్ట్‌మీటర్ ఖరీదు భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచితే గగ్గోలు పెట్టిన చంద్రబాబు, పవన్, లోకేష్ నేడు వేల కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపడం అంటే ప్రజలను వంచించడమేనని అన్నారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే ప్రజా ఉద్యమాలతో సమాధానం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్.కనకారావు, ఎం.ఇస్సాక్, పి.ఆదిశేషు, పి.రవికుమార్, కె.విజయలక్ష్మి, ఎ.శ్యామలారాణి, బి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన వరద గోదావరి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం వద్ద తగ్గుతున్న గోదావరి జలాలు

గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం 23 అడుగులకు తగ్గడంతో వరద ఉధృతి తగ్గింది. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో ఎడవల్లి వద్ద ఉన్న ఎద్దువాగు కాజ్‌వేపై వరద నీరు తగ్గుముఖం పట్టి రాకపోకలు ప్రారంభమయ్యాయి.

కుక్కునూరు రూరల్: నాలుగు రోజులుగా పెరుగుతూ వచ్చిన గోదావరి వరద శాంతించింది. ఆదివారం భద్రాచలంలో 31.6 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం సోమవారం 23 అడుగులకు తగ్గింది. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వేపై నీరు తొలగడంతో రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి. గోదావరి వరద తగ్గటంతో మండల ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలవరం: పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 4,11,238 క్యూసెక్కుల అదనపు వరద జలాలను జలవనరుల శాఖాధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 29.550 మీటర్లు, దిగువన 20.270 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 29,800 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 19,600 మీటర్లు, ఎగువ దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.150 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ దిగువన 8.46 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

పిజిఆర్ఎస్‌కు 389 అర్జీలు రాక

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆమె 389 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ శ్రీహరి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగంగా పరిష్కరించినప్పుడే ప్రభుత్వ అధికారులపై ప్రజలకు విశ్వాసం కలుగుతుందన్నారు. పోలీస్ శాఖకు సంబంధించి అందిన అర్జీలను చట్టపరిధిలో తగు న్యాయం చేయాలన్నారు. ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన దొంగ నరసింహ వీరాంజనేయులు అర్జీనిస్తూ రేషన్ కార్డులో తొలగించిన తన పేరు తిరిగిన నమోదు చేయాలని కోరారు. ఏలూరు హనుమాన్ నగర్ కు చెందిన గొల్లపల్లి వెంకటరమణ అర్జీనీస్తూ తమ భూమిని చేపల చెరువుకు ఇచ్చామని, అయితే 2018 నుండి లీజు ఇవ్వటం లేదని, పైగా తమ కుటుంబంపై దౌర్జన్యం చేస్తున్నారని, ఈ విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ముసునూరు మండలం గోపవరానికి చెందిన గురజాల వెంకటేశ్వరరావు అర్జీని ఇస్తూ తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నూజివీడు పురపాలక సంఘ కార్యాలయం వద్ద కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు గత ఏడేళ్ల నుంచి జీతాలు పెంచకపోవడం చాలా దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, నిబంధనలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ

నూజివీడులో...

కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు ఎస్ఆర్.హనుమాన్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఎఐటియుసి అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ ఉద్యోగ సిబ్బంది ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పి.కిషోర్ మాట్లాడారు. మున్సిపల్ పట్టణాలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ ఉద్యోగుల్లో స్కిల్డ్, సెమీ స్కిల్డ్‌గా గుర్తించిన వారికి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఉద్యోగులు నాగేశ్వరరావు, నారాయణరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణవారిగూడెంలో భూ వివాదం

విచారణకు రెవెన్యూ కార్యాలయానికి పంపిన సిఐ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్వర్ణవారిగూడెం గ్రామ సమీపంలోని చెరువుకు ఆనుకుని ఉన్న 189 సర్వే నెంబర్‌లో సుమారు 35 ఎకరాల ప్రభుత్వ భూమిపై స్థానిక గిరిజనేతరులకు, పాములవారిగూడెం గ్రామానికి చెందిన పలువురు గిరిజనులకు మధ్య భూ వివాదం చోటు చేసుకుంది. దీంతో స్థానిక గిరిజనేతరులు కొంతమంది సోమవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి చేరుకుని పూర్వం నుంచి తమ సాగులో ఉన్న భూముల్లోకి గిరిజనులు వచ్చి అడ్డు పడుతున్నట్లు ఫిర్యాదు అందించినట్లు తెలిపారు. దీనిపై సిఐ బి.వెంకటేశ్వరావు ఇరు గ్రూపులను పిలిచి వారి దగ్గర ఉన్న ఆధారాలను పరిశీలించి దీనిపై పూర్తి విచారణ చేయాలని స్థానిక రెవెన్యూ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు.

ఎంఆర్‌పికే ఎరువులు విక్రయించాలి

విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.తాతారావు

ముదినేపల్లి : ఎంఆర్‌పికి మించి ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని రాజమండ్రి విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.తాతారావు చెప్పారు. మండలంలోని శ్రీహరిపురం, ముదినేపల్లి గ్రామాల్లో విత్తన, పురుగుమందుల, ఎరువుల దుకాణాలను సోమవారం విజిలెన్స్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అమ్మే దుకాణదారులు విధిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, ఎంఆర్‌పికి మించి ఎరువులు విక్రయించరాదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో శ్రీహరిపురం షణ్ముఖ ఎంటర్‌ప్రైజెస్‌లో సరైన పత్రాలు లేని రూ.1,89,292 విలువైన 25.075 మెట్రిక్ టన్నుల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. రెవిన్యూ డివిజన్ పరిధిలో 27 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

శిక్షణిచ్చేందుకు వెళ్లి శవమై వచ్చారు..!

- నల్లజర్లలో అరటకట్ల హెచ్‌ఎం మూర్తిరాజు గుండెపోటుతో మృతి
- ప్రభుత్వ తీరుతో ఒత్తిడికి గురయ్యారని ఉపాధ్యాయ సంఘాల ఆవేదన

ప్రజాశక్తి - పాలకొల్లు

'ఉదయమే నేనే బండిపై తీసుకెళ్లి బస్సు ఎక్కించాను. ఇప్పుడు శవమై వచ్చారా' అంటూ ఆమె రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. పాలకొల్లు మండలం అరటకట్ల జెడ్‌పి హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేస్తున్న ఎస్‌విఆర్.మూర్తిరాజు (61) తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య పద్మావతి, కుమారుడు దిలీప్ వర్మ, కుమార్తె లాస్యవర్మ ఉన్నారు. నల్లజర్లలో సోమవారం ప్రారంభమైన ఎస్ఎల్‌డిటి శిక్షణ తరగతులకు ఆయన రిసోర్స్‌పర్సన్‌గా వెళ్లారు. ఆయన శిక్షణ తరగతి ప్రారంభించి మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆయనను వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని పాలకొల్లు హౌసింగ్ బోర్డులోని స్వగృహానికి తరలించారు. ఉదయం తన మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి బస్టాండ్‌లో బస్ ఎక్కించిన భర్త జీవం లేకుండా తిరిగి రావడాన్ని చూసి ఆయన భార్య తల్లడిల్లారు. కుమారుడు ప్రస్తుతం ఎంఎస్ చేయడానికి అమెరికాలో ఉన్నారు. వివాహితైన కుమార్తె హైదరాబాద్ నుండి బయల్దేరారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్స్ రాజశేఖర్, పి.శ్రీనివాసరావు, నేతలు శీలం ఆంజనేయులు, జి.ప్రకాష్, సాంబమూర్తి, నేతలు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.



మూర్తిరాజు (ఫైల్‌ఫొటో)

ఉపాధ్యాయుల ప్రాణాలతో అధికారుల చెలగాటం

యుటిఎఫ్ నేతల విమర్శ

మూర్తిరాజు గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వారు పాలకొల్లులోని మూర్తి రాజు ఇంటి వద్ద ప్రజాశక్తితో మాట్లాడారు. అధికారులు శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురిచేసి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. దీనికి కారకులైన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శిక్షణ, వెబెక్స్ ఆన్‌లైన్ మీటింగులతో ఉపాధ్యాయులను భయాందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. పాఠశాల తెరిచిన ఈ రెండు నెలల్లో ఉపాధ్యాయులను పిల్లలకు సంతృప్తిగా పాఠాలు బోధించకుండా యోగాడే, మెగా పేరెంట్స్ మీటింగ్ తదితర కార్యక్రమాలతో తీవ్ర ఒత్తిడికి గురి చేశారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కంటే, ఆ కార్యక్రమాల డాక్యుమెంటేషన్, ఫొటోలు, వీడియోలు అప్లోడింగ్ పని భారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు మానసిక ప్రశాంతత ఉంటే మంచి బోధన చేయగలుగుతారన్నారు. మూర్తిరాజు మృతికి సంతాపంగా, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను ఆపాలని కోరుతూ మండలంలోని మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ నిరసనల్లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దండు పద్మావతి, మండల అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.రామ్మూర్తినాయుడు, గౌరవాధ్యక్షులు వి.జగ్గారావు, కార్యదర్శులు బి.శైలజ, ఎం.బాపిరాజు. ఎం.శ్రీధర్, ఎం.రాంబాబు, జిల్లా కౌన్సిలర్ ఆర్.సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

లీజు చెల్లించాకే రొయ్యల పట్టుబడి చేయాలి

- ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు
- వ్యాన్ ముందు బైఠాయించి ఆందోళన
- పోలీసుల జోక్యంతో విరమణ

ప్రజాశక్తి - మండవల్లి

సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూముల్లో నిర్వహిస్తున్న రొయ్యల పట్టుబడిని దళితులు అడ్డుకున్నారు. లీజు చెల్లించేంతవరకు రొయ్యల వ్యాన్ కదలనియమంటూ వ్యాన్ ముందు బైఠాయించి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఘటన మండలంలోని సింగనపూడిలో సోమవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ పెత్తందారి మాడపాటి కృష్ణప్రసాద్ లీజు చెల్లిస్తావని ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన 16 ఎకరాల చెరువును లీజుకు తీసుకుని, లీజు ఇవ్వకుండా అడ్డగించాడని చెప్పారు. దీంతో భూమిని స్వాధీనం చేసుకుని కొన్ని రోజులుగా భూ పోరాటం నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో లీజులు చెల్లించి రొయ్యలను పట్టుబడి చేయాలని సబ్ లీజుదారుడికి కూడా చెప్పినట్లు తెలిపారు. అయితే సోమవారం చెరువులో రొయ్యలు పట్టుబడి చేస్తుండగా సొసైటీ సభ్యులు, దళితులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. లీజు చెల్లించి పట్టుబడి చేయాలని అప్పటివరకు వ్యాన్‌ను కదలనియమంటూ వ్యాన్ ముందు బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. లీజులు చెల్లించేలా చేసి న్యాయం చేయాలని, అప్పటివరకు పట్టుబడిని నిలుపుదల చేయాలని బాధితులు ఎస్ఐను కోరారు. ఎస్ఐ రామచంద్ర మాట్లాడుతూ చెరువు విషయంపై గొడవలు పడవద్దని, ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన పత్రాలతో పోలీస్ స్టేషన్‌కు రావాలని, అప్పటివరకు పట్టుబడి చేయకుండా నిలుపుదల చేస్తానని ఎస్ఐ హామీ ఇచ్చారు. దీంతో ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు జగదీష్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వడాలి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ముదినేపల్లి


వడాలి సొసైటీ త్రిసభ్య కమిటీ

మండలంలోని వడాలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నూతనంగా నియమితులైన త్రిసభ్య కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వడాలి సొసైటీ అధ్యక్షులుగా అనగాని గంగాధరరావు, సభ్యులుగా మరడాని సత్యనారాయణ, మందపాటి గంగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పెదగొన్నూరు డిసి వైస్ ఛైర్మన్ కట్టా కోటయ్య, డిసి సభ్యులు ఎం.శంకరరావు, బుద్ధ కాశీ వరప్రసాద్, పాలకేంద్రం ఛైర్మన్ ఈడే బాపూజీ, సొసైటీ కార్యదర్శి మరీదు బాలదాసు, బ్యాంకు ఖాతాదారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల మార్పుపై విచారణ చేపట్టాలి

కలెక్టర్‌కు ఎంఎల్‌ఎ ఫిర్యాదు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని కొమ్మర కొమ్మర గ్రామంలో అసైన్డ్ భూములను కొంతమంది వ్యక్తులు తారుమారు చేస్తున్నారని, దీనిపై విచారణ చేయాలని గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటు వెంకటరాజు కలెక్టర్ వెట్రిసెల్వికి ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులను చట్టప్రకారం శిక్షించాలని కోరారు.

మరింత మెరుగైన సేవలు

రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో అన్ని స్వచ్ఛంద సేవాసంస్థలు, ఎన్‌జిఒ సంస్థలతో కలిసి ముందుకు సాగితే మరింత మెరుగైన సేవలు అందించగలమని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం 2025-26 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మల్లాది సీతా రామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కెఎల్‌ఎన్.ధనకుమార్ సభను నిర్వహించగా దాకారపు కృష్ణ, పాలపర్తి శ్రీనివాస్, పలువురు పెద్దలు సభను ఉద్దేశించి మాట్లాడారు. రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి గత అధ్యక్ష, కార్యదర్శులైన ఉడా రామ్‌గోపాల్, భవిరిశెట్టి హనుమాన్ తిలక్ నుంచి కొత్త అధ్యక్ష కార్యదర్శులైన పెనుమర్తి సురేష్‌బాబు, సంధ్య ప్రవల్లికలకు బాధ్యతలు అప్పగించారు.

వర్క్‌షాపు ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

ఎస్ఎస్‌ఆర్ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతనియల్ అధ్యక్షతన లేటెస్ట్ ట్రెండ్స్ అన్ హ్యాండ్ బాల్ గేమ్‌పై నాలుగు రోజుల వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్స్‌గా ఎన్‌టిఆర్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.కృష్ణదీపిక, పంచాయతీ సెక్రటరీ వలపుల సౌజన్య, , పెదవేగి మండలం విజయరాయికి చెందిన ఫార్మర్ నేషనల్ ప్లేయర్ పాల్గొన్నారు. హ్యాండ్ బాల్ క్రీడలో నేషనల్ ప్లేయర్స్‌గా ఎంతో అనుభవం ఉన్న వీరు కళాశాలలో తర్ఫీదు పొందుతున్న కాబోయే వ్యాయామ ఉపాధ్యాయులకు హ్యాండ్‌బాల్ క్రీడపై వర్క్ షాపులో ప్రాక్టికల్, థీయరీ విభాగాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ లెక్చరర్ డాక్టర్ వై.పోల్ రెడ్డి, డాక్టర్ దిలీప్‌కుమార్, డి.రత్నబాబు, వ్యాయామ విద్య ట్రైనిస్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టిడిపి : మాజీ మంత్రి

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కార్యకర్తలకు, నాయకులకు ఆ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎపి మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ మహిళా ఛైర్మన్ పీతల సుజాత అన్నారు. మండలంలోని ప్రగడవరం టిడిపి నాయకులు మానేపల్లి రాజారావు కుమారుడు మానేపల్లి కిషోర్‌కు ఇటీవల ఆపరేషన్ జరిగింది. దీంతో ఆమె సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా అని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

కృత్రిమ కాళ్లు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందించడం ఎంతో అభినందనీయమని హీల్ సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి హీల్ స్కూల్‌లోని కృత్రిమ అవయవ కేంద్రంలో చుండూరు కోటయ్య-రామశేషమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహాయంతో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 13 మందికి 15 కృత్రిమ కాళ్లను ట్రస్టు ముఖ్య బాధ్యులు చుండూరి మధుసూదనరావు దంపతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమకాళ్లను పొందిన బాల, బాలికలు తమ విద్యను కొనసాగించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, వయోజనులు స్వశక్తి మంతులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ఫెసిలిటీస్ డైరెక్టర్ టి.భాస్కర్, ప్రముఖ సంఘసేవకులు చుండూరు బుజ్జమ్మ, గవిర్నేని పద్మ, వీరపనేని రామారావు, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సంక్షేమ పథకాలను హక్కుగా సాధించేందుకు అర్హులైన ప్రతిఒక్కరూ ఆయా పథకాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి సూచించారు. స్థానిక 43వ డివిజన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజా అవగాహనతోనే సుస్థిరాభివృద్ధి సాధ్యమన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

పలువురి దాడిలో గాయాలపాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన చాట్ల వారి కుటుంబీకులు, వారి అనుచరులు కలిసి లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన గంధం రాంబాబుపై ఈ నెల ఐదో తేదీన దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన రాంబాబు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 13వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. మృతుని బంధువులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాంబాబు (38) తన భార్యతో కలిసి కొన్నేళ్ల నుంచి సూరేపల్లి గ్రామంలో ఉంటున్నాడు. పాత గొడవల నేపథ్యంలో రాంబాబుపై దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

కాపర్ వైరు చోరీపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కాపర్ వైరు చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... టి.నరసాపురం గ్రామ శివార్లలో ఓబిళ్ల వెంకటేశ్వరరావు పొలంలో గుర్తు తెలీని వ్యక్తులు ఓబిళ్ల వెంకటేశ్వరరావు, ఓబిళ్ల నాగరాజులకు చెందిన ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి రూ.పది వేల విలువైన కాపర్ వైరు అపహరించుకుపోయారు. టి.నరసాపురం ఎలక్ట్రికల్ ఎఇ దాసరి శ్రీనివాసరావు ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

తన భర్త కన్పించడంలేదని భార్య టి.నరసాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్రంపాలెం గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ (64) కొంతకాలంగా బిపి షుగర్‌తో బాధపడుతూ మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల ఏడో తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కలా, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో షేక్‌మీరాసాహెబ్ భార్య షేక్ మాబు సుభాని పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ట్రాఫిక్ చట్రంలో నూజివీడు పట్టణం..!

నిత్యం నరకం చూస్తున్న వాహనదారులు
స్వాతంత్రం తొలినాళ్లలోని రోడ్లు
జిల్లా పునర్విభజనతో తొలగిన ట్రాఫిక్ ఎస్ఐ పోస్ట్
పట్టించుకోని పాలకులు

పట్టణంలో ట్రాఫిక్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణం పూర్తిగా ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోయింది. రెవెన్యూ డివిజన్ కేంద్రం కావడంతో విద్యాసంస్థలు, వ్యాపార దుకాణాలు, కూడళ్లు నానాటికి పెరిగాయి. ప్రజల అవసరాల నేపథ్యంలో రోడ్ల విస్తరణ ఏ మాత్రం జరగలేదు. ఆ దిశగా పాలకులు సైతం దృష్టి సారించలేదు. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు పెరిగిపోతున్న రద్దీతో ట్రాఫిక్ సమస్య మరింతగా జఠిలమవుతుంది. జిల్లాల పునర్విభజనకు పూర్వం నూజివీడు పట్టణంలో ట్రాఫిక్ ఎస్ఐ ఉండేవారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్‌ను నియంత్రించడంలో ఆయన ప్రధాన భూమిక పోషించేవారు. జిల్లాల పునర్విభజన అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ పోస్టు ఎత్తివేశారు. పట్టణంలో సిబ్బంది కొరతతో నూజివీడులో నిత్యం ట్రాఫిక్‌తో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. ఎలాగూ రోడ్ల విస్తరణ జరగనే జరగదు... కనీసం ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్ ఎస్ఐ పోస్టు కొనసాగించి ఉంటే కొంత సమస్యకు పరిష్కారం లభించేదని వాహన చోదకులు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూజివీడుకు ట్రాఫిక్ ఎస్ఐను, సిబ్బందిని నియమించాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

మంత్రివర్య.. రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించండి..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే ట్రాఫిక్ సమస్య, రోడ్ల సమస్య లేకుండా చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఎన్నికలకు ముందు ప్రజలకు వాగ్దానం ఇచ్చారు. ఈ వాగ్దానం మేరకు నూజివీడు పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య, ప్రజల అవసరం మేరకు విస్తరణ చేపట్టాల్సిన రోడ్ల వ్యవహారం పట్ల రాష్ట్ర మంత్రి పార్థసారధి ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రాంత ప్రజానీకం ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

మహిళల స్వయం సమృద్ధి కోసం రుణాలు

వెలుగు ఎపిఎం కోమటి రాంబాబు

చిట్ చాట్

ప్రజాశక్తి - ముసునూరు

పొదుపు సంఘాల కార్యకలాపాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు (డ్వాక్రా) కుటుంబ, వ్యాపార అవసరాల కోసం రుణాలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం కొత్త విధానాలను అమలు చేస్తుందని ముసునూరు వెలుగు ఎపిఎం కోమటి రాంబాబు అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలుపుతున్న వెలుగు ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ముసునూరు మండలంలో ఎన్ని డ్వాక్రా సంఘాలు ఉన్నాయి? అందులో ఎంతమంది సభ్యులు ఉన్నారు?

ఎపిఎం : మండలంలోని 16 గ్రామ పంచాయితీల్లో 488 స్వయం సహాయాక సంఘాల్లో 14,729 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజి రుణాలు ఇంకా వివిధ రుపాల్లో విద్యావికాసానికి దోహదపడేందుకు నాలుగు శాతం (35) వడ్డీపై రుణాలు ఆందిస్తాం.

ప్రశ్న : ప్రస్తుతం టార్కెట్ వివరాలు తెలియచేయగలరా?

ఎపిఎం : గతేడాది రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తి చేశాం. ఈ ఏడాది స్త్రీ నిధి రూ.12 కోట్లు, బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.55 కోట్లు, ఉన్నతి రూ.40 లక్షల వరకు రుణసాయం ఆందించేందుకు ప్రభుత్వ విధి విధానాలను అనుసరించి సర్వే చేస్తున్నాం. ప్రతి ఎనిమిది సంఘాలకు ఒక యానిమేటర్‌ను ఎంపిక చేసి గ్రూపు సభ్యులకు ఎలాంటి రుణసాయం కావాలో, వారిని వివరాలు అడిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అలా యాప్‌లో నమోదు చేసిన వివరాలు కమ్యూనిటీ క్లస్టర్ల (సీసీ) లాగిన్ నుంచి ఎపిఎం లాగిన్‌కు వస్తాయి. వాటిని పరిశీలించి ప్రభుత్వ నిభంధనల ప్రకారం రుణ సాయానికి బ్యాంకర్లకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

ప్రశ్న : విఒఎలు గ్రామ సంఘ (సహాయకులు) ఎంత మంది ఉన్నారు?

ఎపిఎం : మొన్నటివరకు 44 మంది విఒఎలు ఉండగా, కొత్తగా ఒకరిని నియమించాం. ప్రతి డ్వాక్రా సంఘంలో పది మంది సభ్యులు కచ్చితంగా స్థానికులు ఉంటారు. గ్రూపు సభ్యలకు రికవరీ ప్రకారం రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నాం. ప్రస్తుతం ప్రతి సభ్యురాలి వివరాలు జియో ట్యాగింగ్ చేస్తున్నాం. గ్రూపులో సభ్యులందరూ ఒకే ఏరియాలో ఉండాలి. జియో ట్యాగింగ్ ప్రకారం గ్రూపు సభ్యులందరూ ఒకే ఏరియాలో ఉంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి బ్యాంకర్ల ద్వారా రుణాలు అందిస్తాం.

ప్రశ్న : విఒఎలుగా ఎవరిని నియమిస్తున్నారు?

ఎపిఎం : మార్గ దర్శకాల ప్రకారం విఒఎలుగా నియమితులయ్యేవారు కచ్చితంగా ఆ డ్వాక్రా సంఘంలో సభ్యురాలై ఉండాలి.

ఐటిఐలో అడ్మిషన్ల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో అడ్మిషన్స్ కార్యక్రమానికి తేదీని పొడిగించినట్లు కళాశాల ప్రధాన అధికారి పి.రజిత తెలిపారు. నూజివీడు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకునేందుకు తేదీని పొడిగించినట్లు తెలిపారు. అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు నూజివీడు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలో చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ అవ్వని అభ్యర్థుల పేర్లు మెరిట్ లిస్టులో పొందుపరచడం కుదరదని స్పష్టం చేశారు. అభ్యర్థులు పదో తరగతి సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మెయిల్ ఐడి, ఆధార్ లింక్డ్ ఫోన్ నెంబర్, ఆధార్ కార్డుతో నూజివీడు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సంప్రదించాలన్నారు. కౌన్సెలింగ్ కోసం ఈ నెల 24వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం పది గంటలకు నూజివీడులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు హాజరు కావాలన్నారు. కౌన్సెలింగ్, ఇతర వివరాలకు 08656 - 232711 సంప్రదించాలని తెలిపారు.

ఎస్‌టి హాస్టల్‌కు నూతన భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెంలో ఉన్న ఎస్‌టి బాలుర కళాశాల హాస్టల్‌కు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.భూషణం మాట్లాడుతూ తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు బన్నె వినోద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కె.డానియల్, పి.అభిలాష్, ఎస్.భార్గవ్, ఎ.వరుణ్, కె.ప్రవీణ్, ఎస్.అనిల్, జి.లచ్చిరెడ్డి, డి.పవన్, పి.కార్తీక్, డి.ఆదిత్య, కె.రామ్‌చరణ్, జి.తేజస్, ఎస్.రామ్‌చరణ్ పాల్గొన్నారు.

మూర్తిరాజు మృతి బాధాకరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో జరుగుతున్న ఎస్ఎల్‌డిటి శిక్షణ తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా ఉన్న పాలకొల్లు మండలం అరట్లకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు ఎస్‌విఆర్.మూర్తిరాజు గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమని ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర అకాడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇ.రామ్మోహన్‌రావు, జి.మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురిచేసి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, దీనికి కారకులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ హారికకు పరామర్శ

ప్రజాశక్తి - ముదినేపల్లి

కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టిడిపి నాయకుల దాడి హేయమైన చర్య అని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. హారికపై దాడిని తీవ్రంగా ఖండిస్తు వైసిపి మండల నాయకులు సోమవారం ఉప్పల హారిక రామును స్వగృహంలో కలిసి పరమర్శించారు. రాష్ట్రంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కే రక్షణ లేకపోతే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏంటని, ఉప్పల హారికరాముపై రాళ్లతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'బిసి మహిళపై దాడి అమానుషం'

కొయ్యలగూడెం : కూటమి పాలనలో దౌర్జన్య కాండ కొనసాగుతోందని జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటికిన శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్మన్ జిల్లా ప్రథమ పౌరురాలు బిసి మహిళ ఉప్పల హారికపై దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. బిసిలను ప్రోత్సహిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం బిసిలపై దాడులు జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటుందని పేర్కొన్నారు. హారికపై దాడి చేసిన వారిని గుర్తించి శిక్షించాలని పేర్కొన్నారు.

3,500కుపైగా ఉద్యోగాల కల్పన శుభపరిణామం

మెగా జాబ్‌మేళాలో కలెక్టర్ వెట్రిసెల్వి

జాబ్‌మేళాలో కలెక్టర్, ఎంపీ, జెడ్‌పి ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మెగా జాబ్‌మేళాలో 42 ప్రముఖ కంపెనీల ద్వారా 3,500 పైగా ఉద్యోగాలు కల్పించడం శుభపరిణామమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 42 జాబ్ మేళాలు నిర్వహించి, 2,400 ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. సోమవారం జాబ్ మేళాలో 42 ప్రముఖ కంపెనీల ద్వారా 3,500 పైగా ఉద్యోగాలు కల్పించడం శుభపరిణామమన్నారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని గట్టి హామీ ఇచ్చామని, అందుకు అనుగుణంగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మెగా జాబ్‌మేళా యువతీ యువకుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ పరిధిలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఎంపీ మహేష్‌కుమార్ కృషి అభినందనీయమన్నారు. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, ఎపి ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఉడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.జితేంద్రబాబు, సిఆర్.రెడ్డి కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్, కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్లు వి.రవిశ్యామ్, కె.రాంబాబు, వి.కిషోర్, కార్తీక్, రామకృష్ణ, నాగరాజు, రామకృష్ణ నాయుడు, సురేష్, సత్యనారాయణ, శ్యామ్ భూషణ్ పాల్గొన్నారు.

'స్వచ్ఛ గ్రామాలాభివృద్ధే స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ లక్ష్యం'

ప్రజాశక్తి - మండవల్లి

స్వచ్ఛ గ్రామాల అభివృద్దే స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ లక్ష్యమని సెంట్రల్ టీమ్ కోఆర్డినేటర్ సునీల్ స్పష్టం చేశారు. మండవల్లి, పెరికేగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను, డంపింగ్ యార్డ్ సంపద కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, హిందూ దేవాలయం, చర్చిలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి దేశ అభివృద్ధికి మూలమన్నారు. గ్రామాల్లోని పారిశుధ్యం, తాగునీరు, పరిశుభ్రతను పూర్తిస్థాయిలో పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ టీమ్ సభ్యులు మధుప్రియ, రాజేష్, శివకుమారి, భూషణం, కార్యదర్శి గిరిజ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో పటిష్టంగా ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలో ప్రధానమైన డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టంగా నిర్మించేందుకు అంచనాలు తయారు చేయాలని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లతో సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భానుప్రతాప్ మాట్లాడుతూ ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ఆదేశాల మేరకు మేయర్ నూర్జహాన్ పెదబాబు సూచనలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి వారం రోజుల పాటు కుంభవృష్టి వర్షం కురిసినా రోడ్లమీద వర్షపు నీటి చుక్క నిలవకుండా ఉండే విధంగా ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థను తయారు చేయడానికి అంచనాలు తయారు చేయాలని ఎంఎల్‌ఎ చంటి సూచించారన్నారు. వివిధ రకాల గ్రాంట్ల ద్వారా సిఎం చంద్రబాబుతో మాట్లాడి తీసుకొస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎంఎల్‌ఎ ఇచ్చిన భరోసాను తీసుకుని ప్రధానమైన డ్రెయినేజీ, శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరిచి ఏలూరు నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఇ సురేంద్రబాబు, డిఇలు, ఎఇలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రిలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

కమిషనర్ వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా నూజివీడు పట్టణ పరిధిలో తాగు నీటి సమస్య రాకుండా నీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకట రామిరెడ్డి తెలిపారు. అదేవిధంగా పట్టణ పరిధిలో వీధి దీపాలు వెలుగేందుకు, పారిశుధ్య పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా నిరంతర ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. నీటి సరఫరా కోసం సతీష్ : 9849906574, యేసుపాదం : 9100952627 సంప్రదించాలని తెలిపారు.

21 నుంచి సెల్‌ఫోన్ రిపేరింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ సోమవారం నుంచి ఉచితంగా సెల్‌ఫోన్ రిపేరింగ్‌పై 30 రోజులు (పురుషులకు, మహిళలకు), జూట్ బ్యాగ్స్(జనపనార సంచులు)పై 14 రోజులు (మహిళలకు మాత్రమే) శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిషోర్ తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి పూర్తిగా ఉచితమని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా టూల్ కిట్టు అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకు నుంచి సర్టిఫికెట్, అర్హులైన అభ్యర్థులకు ముద్ర లోను సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9948565256 సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సైబర్ మోసంలో రూ.1.64 లక్షలు అపహరణ

తిరిగి రప్పించిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సైబర్ నేరానికి గురైన బాధితుడికి అతను పోగొట్టుకున్న రూ.1.64 లక్షల నగదును తిరిగి ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అందించారు. కైకలూరు మండలం తామరకొల్లు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి శ్రీనివాసరావు స్థానికంగా చిన్న వ్యాపారం చేస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మే నెల 13వ తేదీన అతని సెల్‌ఫోన్‌కు ఒక ఎపికె ఫైల్ వచ్చింది. ఆయనకు తెలియకుండానే ఆ ఫైల్‌ను ఆయన ఓపెన్ చేసాడు. వెంటనే అతని ఖాతా నుంచి రూ.1.64 లక్షలు అపహరణకు గురయ్యాయి. వెంటనే అతను కైకలూరు రూరల్ పోలీసులను, బ్యాంకు అధికారులను ఆశ్రయించాడు. దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ పోలీసులు అతను పోగొట్టుకున్న సొమ్మును తిరిగి అతని ఖాతాకు కూడా రప్పించారు. ఆ సొమ్ము మొత్తాన్ని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ చేతుల మీదుగా కైకలూరు టౌన్ సిఐ కృష్ణ ఆధ్వర్యంలో శ్రీనివాసరావుకు సోమవారం సాయంత్రం అందించారు.

బిఎల్‌ఒలకు శిక్షణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులపై దృష్టి పెట్టాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్ భాస్కర్ బిఎల్‌ఒలకు ఆదేశించారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారుల ఫేజ్-2 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది జగదీశ్వరీ, షరీఫ్, నిఖిల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా శ్యామ్ గణేష్

ప్రజాశక్తి - మండవల్లి

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా వరద శ్యామ్ గణేష్, ప్రాంతీయ కార్యదర్శిగా తుంపూడి గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సన్నిధి నాగసాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండవల్లి మండలం ఆర్యవైశ్య సంఘాన్ని ఎన్నుకున్నారు. మండలానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు మండలానికి చెందిన పలువురు వక్తలు వారిని అభినందించారు. ఈ సందర్భంగా వరద శ్యామ్‌గణేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అపకర్మల భవన నిర్మాణం కోసం రూ.నాలుగు లక్షల విలువైన భూమిని నానమ్మ తాతయ్య వేణుగోపాలరావు, శేషారత్నం జ్ఞాపకార్థం ఆర్యవైశ్య సంఘానికి దానంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం వరద శ్యామ్ గణేష్‌ను, తుంపూడి గణేష్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు ఘంటసాల రాజమోహన్, కన్నయ్య, కొత్త లక్ష్మీనారాయణ, తిరువీధి సుబ్బారావు, మామిడిశెట్టి శివప్రసాద్, పుల్లవతి నటరాజ్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని మల్లారం గ్రామంలో ఈ నెల తొమ్మిదో తేదీన ఆశా వర్కర్ అద్దం మేరీ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి మొత్తం పూర్తిగా ధ్వంసమైంది. బాధిత కుటుంబానికి ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కూరం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం సాయం అందించారు. జీలుగుమిల్లి మండల పిహెచ్‌సిలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కూరం ప్రసాద్, మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు 25 కేజీల బియ్యం, వంట నూనె, కూరగాయలు, దుప్పట్లు, బట్టలు, గ్యాస్ స్టవ్, నిత్యావసర సరుకులు, సింగిల్ కాట్ మంచం, వంట సామగ్రి అందించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్ అగతా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది కలిసి రూ.20,500 అందించారు. రుద్రంకోట గ్రామానికి చెందిన పలివెల రాజు రూ.వెయ్యి విలువైన నిత్యావసర సరుకులు అందించారు. ప్రతిఒక్కరూ సహాయం చేయడానికి రావాలని, ప్రభుత్వం స్పందించి వారికి పక్కా ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. సహాయం అందించిన సిబ్బందికి కృతజ్ఞతలు సమ్మయ్య, మేరీ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకటన

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, BHIMAVARAM

O.S.No.410/2024

Between :
Plaintiff : Canara Bank, JP Road Branch, Bhimavaram, Rep by its Branch Manager.
Defendants : M/s.R.S.Vastralayam Bhimavaram, Rep by its Prop. Nimmala Rama Srinivas and another
Ist Defendant Address :
M/s.R.S.Vastralayam, Bhimavaram, Rep by its Prop.Nimmala Rama Srinivas, D.No.17-6-14, Mentevari Street, Bhimavaram.-1.
2nd Defendant Address :
Nimmala Rama Srinivas, S/o.Venkata Subba Rao, Business, D.No.17-6-34, Angel cut Picses, Mentevari Street, Bhimavaram-1.

పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ అది అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది తరపున ప్రతివాదులపై శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు ది.4-8-2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేనిఎడల శ్రీకోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

ఆల్తి శివరామకృష్ణ
అడ్వకేట్, శ్రీరాంపురం
భీమవరం | భీమవరం.
తేది.10.7.2025 | సెల్: 98484 60585

ప్రకటన

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, BHIMAVARAM

O.S.No.231/2024

Between :
Plaintiff : Union Bank of india Industrial Estate, Branch Bhimavaram, Rep by its Branch Manager.
Defendants : 1.Uday Garments Bhimavaram, Rep by its Prop.Mallula Sirisha & another.
Ist Defendant Address :
Uday Garments, Bhimavaram, Rep by its Prop. Mallula Sirisha, Plot No.23, Industrial Area, Bhimavaram.
2nd Defendant Address :
Mallula Sirisha, W/o.Uday Bhaskar, D.No. 10-2-50/a, Gubbala Narasimha Rao, Building, Chinaranganipalem, Bhimavaram.

పై నెంబరు దావాలో ప్రతివాదులకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ అది అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది తరపున ప్రతివాదులపై శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. ప్రతివాదులు ది.4-8-2025 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేనిఎడల శ్రీకోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

ఆల్తి శివరామకృష్ణ
అడ్వకేట్, శ్రీరాంపురం
భీమవరం | భీమవరం.
తేది.10.7.2025 | సెల్: 98484 60585